కథానిక

# భార్యాత్వపు దృష్టిలోపం

కు. జానకిరాం పట్నాయకులు

రమ యింట్లో పాదంవుంచటమే ఆలస్యమైంది. తలోవిధంగా చెప్పనారంభించారు. "అమ్మాయి గారూ! మీరు వెళ్లిపోవటం చాలా తప్పయింది. పోనీ వెళ్ళినవారు వారంపదిరోజుల్లో తిరిగి రావల్సింది." అని వంటలక్క అన్నది. "ఆయమ్మ గోరు నిన్న సందెకాడే ఆరిబంగలా కెల్లిపోనారు. యీ మూణ్ణెల్లూ యిక్కన్నే వున్నారు. మీరొత్తారని తెల్సిందికావోసు మకాం ఎత్తేసేరు!" అని ముసిముసినవ్వుతూ దాసీదిచెప్పింది. "మీరెళ్లిపోయిన్నుంచీ బాబుగారు ఒకగంటయినా బయటికెళ్ళలేదంటే నమ్మండి. మూడుపొద్దులూ యీ సంపంగిచెట్టుదగ్గిరే ఆయమ్మగారితో ఉంటుండేవారు." అని తోటమాలి అన్నాడు. "రమా! ఆయన్నింత స్వేచ్ఛగా ఒదిలేయటం ఏమిటమ్మా? నీ కోపం, తామసం యెందుకు పనికొచ్చిందో చెప్పు? ఏమిటో సాధించేదామని అమ్మగారింటికి వెళ్ళిపోయావ్! మూడుమాసాలు కూచున్నావు! ఏంచెయ్యగలిగావ్? కోతిని విడిపించుకోబోతే కొండముచ్చు ఎదురైనట్టయింది!" అని ఎదురింటి సరళ అన్నది. "ఎంతయినా అది మొగుడుచచ్చిన ముండ! అంత బర్తెంచుకోవడ మేమిటమ్మా? అందుకే యీ కరువులూ, కాటకాలూ, ఉత్పాతాలున్నూ! ఆడదైవుండీ అలా తెగబడి మీద పడిపోతూ ఉంటే ఏ మగ మహారాజూరుకుంటాడు? ఏమోనమ్మా? మా కాలంలో యిలాంటి వెరగం!"అని పొరుగునున్న అరవైయేళ్ళ వృద్ధ వితంతువు అన్నది... ప్రొద్దుపోయేవరకూ వచ్చే పోయేవాళ్ళు ఒకటేగోల! ఎవరినోటవిన్నా ఒకటే మాట!

ఆ రాత్రి రమ భోజనం చేయలేదు. ఇంత కాలమూ గుట్టుగా ఉంటూన్నదనుకొన్న తన సంసారపు గొడవలు ఒక్కసారి వీధిని పడ్డాయి. దానితో ఆమె ఆకాశంనుంచి ఒక్కసారి భూమ్మీదకు త్రోసివేయబడ్డట్టు బాధ పడింది. తలలో ఏన్నో ఆలోచనలు బయలుదేరాయ్!...తను ధనికసంప్రదాయంలో పుట్టిపెరుగుకొచ్చింది, తలిదండ్రుల కొక్కర్తె! పసితనంనుంచీ గారాబం జ్ఞానంవచ్చాక అధికారం. ఒకర్ని అదిమిపెట్టడం నేర్చుకుందికాని ఒకరి క్రింద అదమబడ్డం నేర్చుకోలేదు! వివాహమైనాకొద్దికాలానికే తండ్రి చనిపోయాడు. తల్లి అంతకుపూర్వమేపోయింది. అయినా భర్తయింటికొచ్చాక కూడ తన అధికారానికి లోపం రానిచ్చుకోలేదు! తనేది కోరితే అది ఆ తక్షణం జరిగితీరాల్సిందే! భర్తకూడ గీచినగీటు దాటి యెరుగడు. కాని యేడాదై తన జీవితంలో ఒక తుపాను రేగింది! అననుకూల పరిస్థితులు తరంగాలై ఉవ్వెత్తునలేచి ప్రశాంత హృదయాన్ని అల్లకల్లోలంచేసివేస్తున్నాయ్! అభిమానపూరితమైన తన వ్యక్తిత్వపునౌక అందులో పడి ఇట్టటు వూగిసలాడిపోతున్నది.

ఆలోచిస్తున్నకొద్దీ వుద్రేకం, ఆ వుద్రేకంలోని వేడీ, ఆ వేడిలోని బాధా ఆమె భరాయించుకోలేకపోయింది. లేచి ముఖాన్ని కడుక్కొని గ్లాసుడు చన్నీళ్లను త్రాగింది. దానితో ఆమెకు కొంత వూరట కలిగింది. అప్పుడు మూడు గంటలైంది. తెల్లవారుజామునవచ్చేచల్లనిగాలులు ఆమె శరీరానికి మరికొంత ప్రశాంతినిచ్చాయ్! పోర్టికోలో మోటారాగిన చప్పుడూ, మాటల అస్పష్టధ్వనీ ఆమెకు వినవచ్చింది. కపటనిద్రనభినయిస్తూ ఆమె మంచంమీదపడియున్నది, మూడునిముషాలకు జోడుచప్పుడామె చెవుల్లో పడ్డది. నిరంజనరావు మంచందగ్గరకొచ్చి తనను పరీక్షగా చూసినట్లు ఆమె గ్రహించింది. వెను వెంటనే దుర్భరమైన దుర్గధం ఆమెనాసికాపుటాల్లో ప్రవేశించింది. అతను చిత్తుగా త్రాగి వున్నాడని ఆమె గ్రహించింది. చెప్పరాని అసహ్యం ఆమెకు కలిగింది. కాని ఓర్చుకుంది.

నిరంజనరావు కాలి జోళ్ళతోనే పరుండిపోయాడు. పదినిముషాల్లో గురకలువినవచ్చాయ్. రమ లేచింది. భర్తవేపు చూసింది... మెల్లమెల్లగా

అతని దగ్గరకువెళ్ళి తలవేపు కూచుంది! చల్లగా నిట్టూర్చింది. మూడుమాసాలైంది తనాతణ్ణి ఒదిలిపెట్టి! వివాహమైన రెండేళ్ళలో యింతదీర్ఘకాలం అతణ్ణుండి వేరైవుండలేదు. అతనైనా వారం రోజులు తనను ఒదిలిపెట్టలేదు! ఆ స్వల్పకాలానికే అతడెంతో బేజారెత్తిపోతూండేవాడు!... అలాంటిది నేటికీపరిస్థితివచ్చింది! నిజంగా మగవాని మనసు కపటపూరితం! ప్రేమకూ ప్రణయానికీ అతనిలో చోటులేదు. బయటికిమాత్రం యెంతో అభిమానాన్ని ప్రకటిస్తుంటాడు. కాని, అదంతా తెచ్చిపెట్టుకున్నదే! వివాహమయేవరకూ ఆదర్శ పురుషుడుగా నటిస్తాడు! తీరా అది అయిపోయేసరికి ఉద్దండుడైపోతాడు.

ఆమె అతని ముఖం దీక్షగా చూసింది. మునుపటి కళాకాంతులామెకందులో కనిపించలేదు. శరీరం కూడా చాలా చిక్కిపోయింది' పసిమివన్నెలో నీలిఛాయలు మసకమసకగా కనిపిస్తున్నాయ్! అతనిలో ఆమార్పుకు కారణం ఆమెకు బోధపడలేదు, కావల్సి తనకు తాను యీ క్షీణదశ తెచ్చుకుంటున్నాడా? అలా తెచ్చుకుంటే దానికి కారణం? అందులో తానెంతవరకు బాధ్యురాలు? మొత్తంమీద ఏడాదైంది అతనిలో యీ మార్పు వచ్చి! అంటే నిర్మల తమ మధ్యకొచ్చిందగ్గరనుంచి! అప్పటినుంచే అతనికి తనమీద వ్యగ్రభావం కలిగింది. తానాడే ప్రతీమాటకూ చిరాకు పడ్డం. తానుచేసే ప్రతీపనికీ విసుక్కోవటం, తనను బయటి కార్యక్రమాల్లో పాల్గొననీయకపోవటం, చివరకు సినిమాలకైనా, షికార్లకైనా తీసుకు వెళ్ళకపోవటం- ఏకాంతంగా గంటలకొద్దీ ఏదో ఆలోచిస్తూండటం, దేన్నో పోగొట్టుకున్నవానిలా దిగులుగా వుండటం తను అడిగితే జవాబివ్వకపోవటం, నిర్బంధిస్తే బయటికి వెళ్ళిపోటం. యిలా వ్యవహరిస్తున్నాడు. అతని నిర్లక్ష్యతకూ, అవహేళనకూ, ఉదాసీనతకూ రోషంవచ్చి తాను వాపోత్తే క్రోధపూరితుడైపోయేవాడు, దానితో యిద్దరి మధ్యా జగడం, ఎడముఖం పెడముఖం, అభోజనం-ఇత్యాదులతో ఇల్లు నిశ్శబ్దమయేది. అలాంటి సమయంలో నిర్మల గాని తన యింట్లో కాలుంచిందీ అంటే అతని వ్యధలన్నీ దూరమై పోతుంటయ్! కోపం పటాపంచలై పోతుంది. వాడిపోయిన వన్నెవన్నెల కళలు పుట్టుకొస్తుంటాయ్. ఆమెలో ఏంప్రభావం ఉందో, ఏ మంత్రశక్తివల్ల ఆమె అతణ్ణి బంధించివేస్తుందో, వారిద్దరి మధ్యా ఏం సంబంధం ఉందో, రోజులకొద్దీ తనాలోచించినా తెలుసుకోలేకపోయింది! ఒకనాటిరాత్రి పదకొండు గంటల సమయంలో అతను శరీరంమీద తెలివిలేకుండా త్రాగి వచ్చాడు. అదే తొలిసారి అతను త్రాగటానికి! అతనలా రాడానికేమొచ్చిందో తనకు అర్థమైంది కాదు! త్రాగుబోతులంటే తనకి తగని అసహ్యం అని తెలిసీ, బహుశా తనను ఏడిపించటానికే అలా త్రాగి వచ్చి ఉంటాడు. మర్నాటి ఉదయం తను ప్రశ్నించింది. "ఇంత నీచులైపోతారని ఎప్పుడూ అనుకోలేదు!" దానికాతడు వ్యంగంగా నవ్వి ఊరుకున్నాడు. ఆ నవ్వు ఉరిసిన వుండుమీద ఉప్పు జల్లినట్లయింది. వెంటనే తను "ఛీఛీ! యింత సిగ్గుమాలిన తనమా? లోకం యేమని పోతుందో అన్న భయమేనా ఉండొద్దూ?" అన్నది. "లోకం అంటుందా! అనుకోనీ!" అన్నాడతడు. "పోనీ నేనున్నానని అయినా మీకుండొద్దూ? నాఇష్టాయిష్టాల్తో మీకవసరంలేదా?" అని తను ప్రశ్నించింది. "హుఁ!"అని అతను ముఖాన్ని రెండో వేపు త్రిప్పుకున్నాడు. తనకు రోషమూ దుఃఖం ముంచుకొచ్చింది. "మీ ఉద్దేశ్యం యేమిటి? నన్నింట్లో వుండమంటారా? ఎటయినా పొమ్మంటారా?"అని అడిగింది. "నిన్నింటో ఉండొద్దని ఎప్పుడన్నాను?" అని అతడడిగినాడు. "మరి వీటన్నిటికీ అర్థమేమిటి?"తను తిరిగి ప్రశ్నించింది: "అలాంటివారు నన్నెందుకు వివాహమాడారు?" అతను క్షణం వూరుకొని, "తప్పయిపోయింది!" అని జవాబిచ్చాడు. "ఆ తప్పులోని అనర్థం అనుభవించటానికి నన్నెందుకు కట్టిపెడుతున్నారు?" అని తను అడిగింది. "నిన్నెక్కడ కట్టిపెట్టాను? ఆ అనర్థం నేను స్వయంగా వడ్డీల్తోసహా అనుభవిస్తూంటే!" అన్నాడతను. "మీరేమిటి అనుభవిస్తున్నారు? మీరు మగ మహారాజులు! ప్రపంచంలో ఉన్న సౌఖ్యాలన్నీ మీవి! అన్నిరకాల విలాసాలూ అనుభవించటానికే మీరు జన్మించారు! పైగా మిమ్మల్ని యింకా ఆనందపరచటానికి నిర్మల ఉండనేవుంది!—"

తనమాట పూర్తికాకుండానే అతను "నోర్మూయ్! యీసారి ఆమె పేరెత్తావంటే..." అని బుస కొట్ట నారంభించాడు. "ఏం? ఆమె పేరు నేనెత్తితే అపవిత్రురాలైపోతుందా?" వికటంగా నవ్వి తను అడిగింది. "అవును! అలానే! నీలాంటి నీచురాలు పేరెత్తితే నిజంగా అపవిత్రురాలే అయిపోతుంది!" అని కండ్లెర్రజేస్తూ రెట్టింపు స్వరంతో జవాబిచ్చాడు. "సరే! యీ యింట్లో ఆ పవిత్రురాలే వుండనీయండి!" అని తను లేచి పోయింది. అప్పుడాతని ముఖం జేవురించుకు పోయింది. పెదవులు వణకనారంభించాయ్. తను పోతూన్న వేపు అగ్నిగోళాల్లాంటి కండ్లతో చూస్తూ వుండిపోయాడు! కాని తనను వారించ లేదు. అలా వారించకపోవటంతో తనకెక్కడ లేని అభిమానం ముంచుకొచ్చింది. వెనకాముందు చూడకుండా కట్టుబట్టల్తో పుట్టింటికి బయలుదేరి వెళ్లిపోయింది. కన్నవారింట్లో ఉంటూండగానే నిర్మల విషయంలో కొన్ని సంగతులు తనకు తెలియ వచ్చాయి. నిర్మల నిరంజనరావులు కలిసి చదువుకున్నారు. వారి మైత్రి ప్రణయరూపం దాల్చింది. వివాహం చేసుకో నిశ్చయించారు. కాని కాలం కలిసిరాలేదు. నిర్మల వివాహం యింకొకరితో జరిగిపోయింది. నిరంజనరావు భావోద్రేకంలోపడి వివాహం మానుకున్నాడు, కాని తనతో పరిచయం కలిగాక తనని పెండ్లాడినాడు. రెండుసంవత్సరాలుగా తనదాంపత్యజీవితం హాయిగా ఆనందంగా కొనసాగింది. అంతలో నిర్మల వితంతువై తమమధ్య కొచ్చింది. ఆదిలో తనుకూడా ఆమెను ఎంతో ఆదరించి గౌరవిస్తుండేది. కాని తనుభర్త ఆమెకు దాసానుదాసుడై పోడం, తనను నిర్లక్ష్యం చేయడం తనలో అపోహాలను తాంచ్చింది. ఒకసారి తమలో తమకు ఘర్షణ అతితీవ్రంగా కలిగింది. "లోకం యెన్నివిధాల ఆడిపోసుకుంటుందో గమనిస్తున్నారా?" అని తను ప్రశ్నించిది. "ఆడిపోసుకోనీ! యెవడు లక్ష్య పెడతాడు" అని జవాబిచ్చాడు. "మీకు లక్ష్యం లేకపోతే పోవచ్చు. కాని నాకుంది! రేపటిరోజున ఆమె నాకు సవతి రూపంలో వచ్చి కూచుంటే—" తన మాట పూర్తి కాకుండనే "అధిక ప్రసంగం చేస్తే దవడపళ్లు రాలగొడతాను జాగ్రత!" అని లేచి బయటకు వెళ్ళిపోయాడు.

నిరంజనరావు పదిగంటలవరకూ గురకలుతీస్తూ పరున్నాడు! రమ అతణ్ణి లేపలేదు. తరువాతే మాటాడుదామని వూరుకున్నది. కాని ఆమె స్నానాలగదిలో వుండగా మోటారు బయలుదేరి వెళిపోయిన చప్పుడు విన్నది. తడబడుతూ ఆమె బయటికొచ్చి భోగట్టాచేసింది. పదినిముషాల్లో అతను తయారై, కాఫీ అయినా తాగకుండా వెళ్ళిపోయినట్టు తెలుసుకున్నది. తన నుంచి తప్పించుకోవటానికే అతనలా చేసివుంటాడని ఆమె వూహించుకుంది! వెంటనే టాక్సీ ఒకటి మాటాడుకొని నిర్మల బంగళాకు బయలు దేరింది. అతను అక్కడకే పోయివుంటాడని ఆమె నిశ్చయం. అక్కడనే తన భవిష్యత్తు ఫయిసలా చేసుకుందామని ఆమె సంకల్పించుకుంది.

తలవని తలంపుగా రమ అలా రావటం నిర్మలకు ఆశ్చర్యంవేసింది. రెప్పపాటు లేకుండా ఆమెవేపు చూస్తూ వుండిపోయింది. వచ్చిన ఆమెను గౌరవించి కూచోబెట్టాలన్న ఆలోచన అయినా ఆమెకు లేకపోయింది!

"ఆయనే?" అని రమ ప్రశ్నించింది. ఆ ప్రశ్నతో నిర్మల తెలివి తెచ్చుకొని "ఎప్పుడొచ్చావు రమా? రా! ఇలాకూచో" అని సోఫా చూపించింది.

"ఆయనే?" మరలా అదే ప్రశ్న వేసింది నిర్మల మాట వినిపించుకోకుండా.

"ఎవరు? నిరంజనరావా?" అని నిర్మల అడిగింది.

"ఆఁ! ఆయగాదే!" రమ హేళనగా అన్నది.

"ఇక్కడకు రాలేదు!"

"రాత్రంతా ఆయన ఇంటిముఖమే చూళ్ళేదు! మీరేమో యిక్కడకేనట్టు మాటాడుతున్నారు! బలే తమాషాగా వుంది!"

"ఏమో ఎక్కడికి వెళ్ళారో? మా యింటికి మాత్రం నిన్నటినుంచి రాలేదు!"

"అయితే ఏమైనట్టు? చిత్తుగా త్రాగి తెల్లారగట్ల మూడింటికి యింటికొచ్చారు! ఉదయం పదివరకూ పరున్నారు. నేను స్నానాలగదిలో ఉండగానే తయారై, కాఫీ అయినా త్రాగకుండా వెళిపోవచ్చారు. ఇక్కడనే ఉంటారని అనుకున్నాను!"

"అనుకుంటే అనుకోవచ్చు. కాని ఇక్కడకు మాత్రం వారు రాలేదు!"

"అయితే ఎక్కడికి వెళ్లి ఉంటారు?"

"నాకేం తెలుసు?"

"మీకు తెలియకపోవడ మేమిటి?"

"అవన్నీ తెలుసుకోవడానికి నే నెవర్తెను?"

"మీ రెవరా? వారిపట్ల మీరు సర్వమూన్నూ! వారిని యీ దుర్దశలోనికి తెచ్చింది మీరేగా? ఇంకా కొత్తగా అడగటు మెందుకు?"

"నేనా?" ఆశ్చర్యంతో నిర్మల ప్రశ్నించింది.

"అవును. మీరే!" అని వ్యంగ్యస్వరంతో రమ జవాబిచ్చింది.

నిర్మల యిక సహించుకో లేకపోయింది. ఉత్తేజిత స్వరంతో యిలా అన్నది. "కాస్త సంబాళించుకొని మాటాడు! నామీద ఎందుకీ నిందలు వేస్తావు? చేతులారా నువ్వే నీ యింటికి చిచ్చు పెట్టుకున్నావు! నేరం నామీద మోపుతున్నావు? చాలా బావుంది నీ వ్యవహారం!"

రమ వ్యంగ్యంగా నవ్వి "సరిసరి! పై పెచీ వేసి నన్నే దొంగను చేస్తున్నారా? శెభాష్!" అన్నది.

"రమా! నే నన్నదాంట్లో లేశమైనా అబద్ధం లేదు! నువ్వు నీ ధనాన్ని కాపాడుకో లేకపోయావు! ఇతర్లకు దోపిడీ యిచ్చివేశావు! అకారణంగా నన్ను నిందిస్తున్నావు! నిందించటమే కాదు చాలా నీచంగా మాటాడినావు! నిరంజనరావుకు భార్యవే కానట్లయితే నిన్నీపాటి బంట్రోతులచేత బయటికీడ్పించి వుందును! కాని బ్రతికిపోయావు!...రమా! నీలో అహంకారం, అభిమానం నిండుకొని ఉంది కాని స్త్రీత్వం లేదు! నీ నడవడినీ, నీ చేతల్నీ ఒకసారి సింహావలోకనం చేసుకో తెలుస్తుంది నేరస్థు లెవరో?" నిర్మల అన్నది.

"నేనే నేరస్థురాలనా?" ఆశ్చర్యంతో రమ అడిగింది.

"అవును! నువ్వే నేరస్థురాలవు! నీ అహంభావంవల్లా, నీ స్వార్థంవల్లా నిరంజనరావు బయటకు దాటిపోయాడు! నీలోని అపోహల భూతం అతణ్ణి సర్వనాశనం చేసింది!...రమా! పురుషుడెంత వృద్ధుడు డైనా అతడు కాంత దాసుడే! చిన్నతనంలో తల్లీ, తరువాత భార్యా అతణ్ణి రక్షించే శక్తులు! అతను సర్వదా శాంతినీ, సౌఖ్యాన్నీ, ఆనందాన్నీ, ప్రేమనూ, సానుభూతినీ కోరుతూ ఉంటాడు. ఇవన్నీ యింట్లో అతనికి లభించాయా అంటే బయట అడుగిడే అవసరమే అతనికి లేదు! నువ్వేమో పుట్టుకతో అహంకారివి! అభిమాన పూరితవు! యీ రెంటితో అతణ్ణి బంధింపచూశావు! కాని అతను కట్టుబడలేదు!... ఆ అహంకార అభిమాన సూత్రాలకు బదులు ప్రేమ ప్రణయ సూత్రాలు వుపయోగించి ఉంటే యీనాడీవిధంగా విచారించక పోయివుందువు! నీలో సహనం లేదు! విశాల భావాలు లేవు! సభ్యత లేదు! నీలోవున్నదంతా ఒకటే! అది భార్యాత్వం! ఆ భార్యాత్వంతో భర్తను సంపూర్ణంగా శాసిద్దామని సంకల్పించుకున్నావు! కాని శాసించలేకపోయావ్! ...నువ్వే కాదు! ఈ లోకంలో ఆ అభిప్రాయం మనసులో వుంచుకొని ఏ స్త్రీకూడా ఏ పురుషుణ్ణీ శాసించలేదు!...నీ వెప్పుడయితే విఫల మనోరథవైనావో అప్పుడు నీలో అపోహలు వేయి రూపాల్తో తలలెత్తినాయి! నిరంజనరావును ప్రతీ విషయంలో అనుమానింప ఆరంభించావ్! దానితో అతడు ఆదర్శ మార్గంనుంచి తొలగిపోయాడు! కర్తవ్యపథంనుంచి దూరమైపోయాడు!"

రమ జవాబు చెప్పలేదు! ఏంచెప్పాలో ఆమెకు పాలుపోలేదు! నిశ్చల దృష్టుల్ని నిర్మల మీద బరపుతూ ఆమె చెబుతున్నది వింటూ ఉండిపోయింది.

"రమా! భార్యాత్వం వచ్చిందనగానే భర్తను వశపరచుకొన్నామని అనుకోవటం పొరపాటు! పురుషుడెల్లప్పుడూ క్రొత్తదనాన్ని కోరుతుంటాడు! సంసారం మధురమయంగా వుండాలంటాడు! సర్వదా శాంతినీ, సుఖాన్నీ, ఆనందాన్నీ వాంఛిస్తుంటాడు! వీటినన్నిటినీ యివ్వాల్సింది భార్య! ఆమె భార్యారూపంలోకన్నా ప్రేయసి రూపంలో అన్నివిధాలా తృప్తిపరచగలదు!...నిరంజనరావు ప్రతి దినమూ నాదగ్గఱకొస్తున్నాడు! ఎందుకు? తన పిపాస తీర్చుకోవటానికా? కాదు!.. తన హృదయాన్ని శాంతింపచేసుకొనటానికి! భగ భగమని మండిపోతూన్న తన మనసును చల్లార్చుకొనటానికి! నీసమక్షంలో అతనికి ఆశాంతి, ఆ శీతలత్వమూ దొరకలేదు!

ఎందువల్ల ? అతనితో సహకరించే సహృదయ స్నేహితుడు నీలో లేకపోవడంవల్ల! అంతే!... నా దగ్గఱకుకూడా అతనెన్నో పర్యాయాలు తప్ప త్రాగి వచ్చాడు! కాని ఒకసారయినా అతణ్ణి నేను అవహేళన చేయలేదు! అసహ్యించుకోలేదు! తిరస్కరించలేదు!...చంటిపిల్లాణ్ణి లాలించినట్లు ప్రేమతో, అనురాగంతో లాలించాను! అతని అకృత్యాల్ని క్షమించాను! దాంతో అతను లజ్జితుడైపోయాడు! మరెన్నడూ త్రాగి అతను నాచెంతకు రాలేదు!...అంటే నా సమక్షంలో అతడు త్రాగడని ధృవపరచుకొన్నాను! అందుకే నువ్వులేని మూడుమాసాలూ నేనతణ్ణి కనిపెట్టుకు ఉండాల్సొచ్చింది!... అయితే నాగురించి లోకం ఏమనుకుంటుందో నాకు తెలియదనుకోకు! రూపమూ, యౌవనమూ ఉన్న వితంతువును నేను! భార్యా సౌఖ్యంనుంచి వంచితుడైనవాడాతను! మా యిరువురమూ ఎడబాయకుండా ఒకే యింటికప్పుక్రింద దినాలతరబడి ఉండటం ఎలాంటివారికైనా అపోహలకూ, అనుమానాలకూ చోటివ్వక మానదు! కాని మాయిరువురిలో ఎవరికీ పాపచింత లేదు! మా హృదయాలమీద మాకు పూర్తి అయిన విశ్వాసంవుంది! అందుకని యిద్దరమూ లోకోపవాదుల్ని లక్ష్యం చేయలేదు!... కాగా నా వునికి అతని నష్టజీవితాన్ని బాగు చేస్తున్నప్పుడు నే నామాత్రం త్యాగంచేయలేనూ? ...నేనే కాదు నా స్థానంలో యింకో యువతి ఉన్నా అలాచేస్తుందని నా విశ్వాసం!... రమా! ఈ విషయాలే విపులీకరించి నీకు వ్రాద్దామని ఎన్నో సారులు ఉంకించాను! కాని అలా వ్రాయటంవల్ల నష్టాలే ఎక్కువగా నాకు కనిపించాయి! అప్పట్లో నీస్థితి నా వ్రాతల్ని మన్నించే మానసంలోవుండదు! పైగా మండుతూన్న క్రోధం దీర్ఘరూపం తాలిస్తే యీ జన్మలో మీకు కలయికలు జరగవు! అందువల్ల ఆ ప్రయత్నం మానుకున్నాను! రమా! యీ మూడుమాసాల్లో నీల్లో తప్పక మార్పువస్తుందనీ, పశ్చాత్తాప పడతావనీ, నీవొచ్చి నీ సంసారాన్ని సరిదిద్దుకుంటావనీ ఆశించాను! అయితే రావడమేమో చేశావు! కాని మార్పూ, పశ్చాత్తాపం నీలో కనిపించలేదు! సరి కదా పూర్వంకన్నా ఎంతో మొండిబారిపోయావు! నీ విద్యా, విజ్ఞానమూ ఎందుకూ పనికొచ్చింది కాదు! నీకంటే చదువులేని దద్దమ్మలే నయమన్నట్టు నిరూపించావ్!"

రమ మరి అచట ఉండలేకపోయింది! చివాలున లేచి నిర్మలను కౌగలించుకొని ఆమె హృదయంలో ముఖం దాచి వెక్కి వెక్కి ఏడవ నారంభించింది. కళంకిని, విశ్వాస ఘాతకిగా రూపించిన ఆమె, దేవీమూర్తిలా కన్పట్టింది!

అంతవఱకూ చాటుననిల్చుండి వారి మాటలు వింటూన్న నిరంజనరావు మెల్లమెల్లగా వచ్చి వారి సమక్షంలో నిల్చున్నాడు. రమ నిర్మలను ఒదిలిపెట్టి అతని చేతుల్లో వాలిపోయింది.

# ఆంజనేయ దండకం

ప్రధానమంత్రి మొదలు
తాలూకాఫీసు గుమాస్తావరకు
పర్యటించారు రాయలసీమలో..
పరిస్థితి మాత్రం విచారకరం
అంటూ వెలిబుచ్చారు సంతాపం
అభివృద్ధికి లక్షలు కోట్లు కావాలని
కాగితాలపై జరుగుతోంది కుంభకోణం
పూర్తికాగానే వెలువడుతుందొక
రామాయణం
పారాయణానికి మాత్రం పనికిరాదు.

మేమంతా చూస్తున్నాం పైకి—
ఢిల్లీవైపు మాత్రం కాదు.
మాలో మేమే తంటాలు పడాలన్న
నెహ్రూగారి సందేశాన్ని
రికార్డు చేసుకున్నాం
ఆపదలలో ఆకలిలో
ఆంజనేయ దండకం లాగా
స్మరించుకుంటే సరిపోతుందని.

—నైనారు అప్పాస్వామి